
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సంగారెడ్డి మెదక్ 5
జిల్లాల వార్తలు
మంగళవారం 25 మార్చి 2025



తెల్ల‘బంగారమే’..!
• అధిక సాంద్రతతో అనేక లాభాలు
• తక్కువ సమయం.. ఎక్కువ దిగుబడి
• ఎకరాకు 15 క్వింటాళ్ల పక్కా.. 7
ప్రజావాణి అర్జీలను పరిష్కరించాలి 8

తెలంగాణలో బీజేపీ ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారు

• ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు కర్రు కాల్చి వాత పెట్టారు • బీజేపీ ఎమ్మెల్సీలు అంజిరెడ్డి, కొమురయ్య



ఎమ్మెల్సీలు అంజిరెడ్డి, కొమురయ్యలను సన్మానిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి

సంగారెడ్డి రూరల్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ప్రజలు రాష్ట్రంలోనూ బీజేపీ ప్రభుత్వం కోరుకుంటున్నారని, ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయమే ఇందుకు నిదర్శనమని బీజేపీ ఎమ్మెల్సీలు అంజిరెడ్డి, కొమురయ్య పేర్కొన్నారు. పోతిరెడ్డిపల్లి చౌరస్తాలోని పీఎస్‌ఆర్ గార్డెన్‌లో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి ఆధ్వర్యంలో ఎమ్మెల్సీలను సోమవారం సన్మానించారు. అంతకుముందు సంగారెడ్డిలోని పాతబస్టాండ్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి వారు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పోతిరెడ్డిపల్లి చౌరస్తా వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎన్ని జిమ్మిక్కులు చేసినా పట్టభద్రులు, ఉపాధ్యాయులు నమ్మలేదని అన్నారు. ఆరు గ్యారెంటీలంటూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ చేసిన మోసాన్ని గ్రహించిన ఓటర్లు ఎమ్మెల్సీ ఎన్నికల్లో కర్రు కాల్చి వాత పెట్టారని పేర్కొన్నారు. కార్యకర్తల కృషితోనే ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధ్యమైందని కొనియాడారు. రోబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులకు అండగా ఉండి గెలిపించుకుంటామని ధీమా వ్యక్తంచేశారు. పట్టభద్రులు, ఉపాధ్యాయుల సమస్యలపై శాసనమండలిలో పోరాడుతామని తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ రాంచంద్రారావు, మాజీ ఎంపీ బీబీపాటిల్ మాట్లాడుతూ ఎమ్మెల్సీలకు, కార్యకర్తలకు అభినందలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ప్రభాకర్‌గౌడ్, జైపాల్‌రెడ్డి, ఆనంద్‌గౌడ్, రాజేశ్వర్‌రావు దేశ్ పాండే, నాయకులు రాజుగౌడ్, ద్వారకా రవి, విజయ్‌కుమార్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామనవమి ఏర్పాట్లపై జగ్గారెడ్డి సమీక్ష

సంగారెడ్డి రామ్‌మందిర్‌కు రంగులు, భారీ లైటింగ్, సౌండ్ సిస్టం



సంగారెడ్డి రామ్‌మందిర్ వద్ద శ్రీరామనవమి ఏర్పాట్లపై సమీక్షిస్తున్న జగ్గారెడ్డి

సంగారెడ్డి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): రానున్న శ్రీరామనవమి వేడుకలకు సంబంధించిన ఏర్పాట్లపై టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి సమీక్ష నిర్వహించారు. సంగారెడ్డిలోని పురాతనమైన రామ్‌మందిర్ ఆలయంతో పాటు రామ్‌మందిర్ కమాన్, దిడ్డిగౌని కమాన్‌కు రంగులు వేయించాలని సూచించారు. ఆలయంలో వెలుగులు విరజిమ్మేలా భారీ లైటింగ్ ఏర్పాటు చేయాలని చెప్పారు. శ్రీరామకల్యాణం మార్మోగేలా పట్టణమంతా సౌండ్‌సిస్టం ఉండాలన్నారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు.





మరో 346 బడుల్లో ‘ఏఐ’ బోధన

వచ్చే విద్యాసంవత్సరం నుంచి అమలు

సంగారెడ్డి అర్బన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థులకు ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్) సాయంతో బోధన అందించాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా తొలి విడతగా జిల్లాలోని 33 పాఠశాలల్లో ఈ నెల 15 నుంచి ఏఐ బోధన ప్రారంభించింది. ఏఐ బోధనతో విద్యార్థుల్లో సామర్థ్యాలు మెరుగవుతున్నాయని గుర్తించిన అధికారులు మరో ముందడుగు వేశారు. జిల్లాలో రెండో విడతగా 50 మంది విద్యార్థుల కంటే ఎక్కువ ఉన్న మరో 346 పాఠశాలలను ఎంపిక చేశారు. వచ్చే విద్యాసంవత్సరం నుంచి ఈ పాఠశాలల్లో ఏఐ బోధన అమలు చేసేందుకు విద్యాశాఖ అధికారులు అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు.

27న ‘గీతం’లో టెడ్‌ఎక్స్

పటాన్‌చెరు రూరల్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : ప్రతిష్టాత్మకమైన ‘టెడ్‌ఎక్స్’ కార్యక్రమానికి గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం హైదరాబాద్ క్యాంపస్ వేదిక కానుంది. గీతం విద్యార్థిని దీక్షితా చెల్లాపల్లి టెడ్‌ఎక్స్ గీతం హైదరాబాద్ -2025 నిర్వహణ కోసం అనుమతి పొందినట్టు స్టూడెంట్ లైఫ్ డైరెక్టరేట్ సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో వెల్లడించింది. ‘మార్పునకు ఉత్ప్రేరకాలు’ ఇతివృత్తంగా నిర్వహిస్తున్న ఈ టెడ్‌ఎక్స్‌లో విభిన్న రంగాలకు చెందిన ప్రతిభావంతులు తమ ఆలోచనలను విద్యార్థులతో పంచుకోనున్నారు. కార్యక్రమానికి మాజీ మంత్రి పళ్లంరాజు, సౌరబ్ శుక్లా, అటికా, రథిన్ రాయ్, సుబ్బు హాజరుకానున్నారని తెలిపారు.

సెక్రెటరీలు కావలెను

వ్యవసాయ మార్కెట్లలో ఇన్‌చార్జిల పాలన

> సిద్దిపేట వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి వెంకటయ్యకు నంగునూరు, బెజ్జంకి, హుస్నాబాద్ మార్కెట్ల బాధ్యతలు కూడా అప్పగించారు. జిల్లాలోనే పెద్దదైన సిద్దిపేట మార్కెట్‌లోనే తీవ్రమైన పని ఒత్తిడి ఉంటుంది. ఇది చాలదన్నట్లు 40 కి.మీ.ల దూరంలో ఉన్న హుస్నాబాద్, 20 కి.మీ.ల దూరంలో ఉన్న బెజ్జంకి, నంగునూరు మార్కెట్లను పర్యవేక్షించడం తలకుమించిన భారంగా పరిణమించింది. నాలుగు మార్కెట్లు అప్పగించడంతో ఇటు కార్యదర్శికి.. అటు రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు.

> మెదక్ వ్యవసాయ మార్కెట్ సూపర్‌వైజర్ ఈశ్వర్‌కుమార్‌కు రామాయంపేట గ్రేడ్-3 మార్కెట్, పాపన్నపేట మార్కెట్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. మెదక్ మార్కెట్‌తోనే సరిపోతుందంటే అదనంగా మరో రెండు మార్కెట్ల బాధ్యతలు కేటాయించడంతో దేనికీ న్యాయం చేయలేకపోతున్నారు.

> సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఇన్‌చార్జి కార్యదర్శిగా మహమూద్ కొనసాగుతున్నారు. ఆరేళ్లుగా ఇక్కడ ఇన్‌చార్జి పాలనే నడుస్తుండటంతో పూర్తిస్థాయి అధికారిని నియమించాలనే విన్నపాలున్నా పట్టించుకోవడం లేదు. జిల్లాలో మరో ప్రధానమైన వట్‌పల్లి మార్కెట్‌కు కూడా రెగ్యులర్ కార్యదర్శి లేకపోవడం గమనార్హం.



తూప్రాన్ వ్యవసాయ మార్కెట్

• ఒక్కో కార్యదర్శికి నాలుగు మార్కెట్ల బాధ్యతలు
• ఉమ్మడి మెదక్ జిల్లాలో పడకేసిన పాలన
• పంట ఉత్పత్తులపై కొరవడుతున్న పర్యవేక్షణ

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, మార్చి 24: రైతులు పండించిన ఉత్పత్తులను సేకరించే వ్యవసాయ మార్కెట్లపై పర్యవేక్షణ కొరవడింది. ఉమ్మడి మెదక్ జిల్లాలోని ప్రధాన మార్కెట్లు సైతం ఇన్‌చార్జిల పాలనలో కొనసాగుతున్నాయి. ఒక్కో సెక్రటరీకి నాలుగేసి మార్కెట్ల బాధ్యతలు అప్పగించి సతమతం చేస్తున్న పరిస్థితి నెలకొంది. కొన్ని సందర్భాల్లో కార్యదర్శులు ఎటూ న్యాయం చేయలేకపోతున్నారనే వాదన వినిపిస్తోంది.

ముగ్గురి చేతుల్లో 11 మార్కెట్లు

సిద్దిపేట జిల్లాలోని వ్యవసాయ మార్కెట్లలో విచిత్ర పరిస్థితి దాపురించింది. వ్యవసాయ ఉత్పత్తుల పరంగా ఈ జిల్లా ముందువరుసలోనే ఉంటుంది. దాదాపు అన్ని మార్కెట్లూ ఆయా కాలాల్లో పంట ఉత్పత్తులతో కళకళలాడుతుంటాయి. అయితే ఉత్పత్తులకు తగినట్లుగా మార్కెట్లలో పర్యవేక్షణ కరువైంది. రెగ్యులర్ సెక్రటరీలు ఉన్నట్లయితే ఎప్పటికప్పుడు రైతులకు ఇబ్బందులు లేకుండా చూసుకుంటారు. పంట కొనుగోళ్లలో దళారుల ప్రమేయాన్ని నియంత్రిస్తారు. కానీ ఇన్‌చార్జిల పాలన ఉండడంతో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. సిద్దిపేట మార్కెటింగ్ శాఖ అధికారిగా ఉన్న నాగరాజుకు అదనంగా చిన్నకోడూరు, కొండపాక, కోహెడ, చేర్యాల వ్యవసాయ మార్కెట్ల ఇన్‌చార్జి కార్యదర్శిగా బాధ్యతలిచ్చారు. ఇక వెంకటయ్య చేతుల్లో సిద్దిపేట, నంగునూరు, బెజ్జంకి, హుస్నాబాద్, జాన్‌వెస్లీకి గజ్వేల్, మిరుదొడ్డితోపాటు మెదక్ జిల్లాలోని తూప్రాన్ మార్కెట్లు ఉన్నాయి. ముగ్గురి చేతుల్లోనే 11 వ్యవసాయ మార్కెట్లు ఉన్నాయంటే అతిశయోక్తి కాదు.

ఒక్కో మార్కెట్‌లో ఒక్కో పరిస్థితి

మెదక్ జిల్లా తూప్రాన్ మార్కెట్ ఉన్నట్లా.. లేనట్లా అన్నట్లుగా తయారైంది. ఇక్కడ రెగ్యులర్ కార్యదర్శిని నియమించలేదు. గజ్వేల్ మార్కెట్ కార్యదర్శి ఇక్కడ ఇన్‌చార్జిగా ఉన్నారు. అటెండర్, వాచ్‌మన్ లేక ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులతో నెట్టుకొస్తున్నారు. జోగిపేట మార్కెట్ కార్యదర్శిగా ఉన్న సునిల్‌ను వట్‌పల్లి ఇన్‌చార్జిగా నియమించారు. జహీరాబాద్, అందోల్, నారాయణఖేడ్, సంగారెడ్డి నియోజకవర్గాల వ్యాపార ఉత్పత్తులతో సంబంధాలున్న వట్‌పల్లికి రెగ్యులర్ కార్యదర్శి లేకపోవడం విడ్డూరమే. ఇక సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ వ్యవసాయ మార్కెట్‌కు మూడేళ్ల నుంచి రెగ్యులర్ కార్యదర్శి లేకపోవడంతో జహీరాబాద్ కార్యదర్శి వీరేశెట్టి ఇన్‌చార్జిగా కొనసాగుతున్నారు. నారాయణఖేడ్ వంటి మారుమూల ప్రాంతాలపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. సిద్దిపేట జిల్లా వంటిమామిడి మార్కెట్‌కు పెద్ద ఎత్తున కూరగాయలు తెస్తారు. ఇక్కడ కూడా రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ సెక్రటరీ రేవంత్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు.



వర్షం పడినప్పుడు చెరువును తలపిస్తున్న కంగ్టి రోడ్డు (ఫైల్)

పదేళ్లుగా అ(థో)దే గతి

కగ్టి-పిట్లం రోడ్డుకు మోక్షమెప్పుడో?

నిధులు మంజూరైనా ప్రారంభం కాని పనులు

దుమ్ము, దూళితో ప్రజల నరకయాతన

సహనాన్ని పరీక్షిస్తున్నారని ప్రజలు మండిపాటు

కంగ్టి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): కొండ నాలుకకు మందేస్తే.. ఉన్న నాలుక ఊడిందనే చందంగా మారింది కంగ్టి-పిట్లం రోడ్డు పరిస్థితి. మండల కేంద్రమైన కంగ్టి క్రాంతిచౌక్ నుంచి బోర్గి క్రాస్‌రోడ్డు వరకు ఉన్న ఈ రోడ్డు అధ్వానంగా తయారైనా పదేళ్లుగా పట్టించుకునే నాథుడే లేడు. 2015లో కంగ్టి-కొడప్‌గల్ రహదారిని డబుల్ రోడ్డుగా మార్చేందుకు రూ.18 కోట్లు మంజూరయ్యాయి. కంగ్టి వద్ద కిలోమీటరు మినహా మిగితా పనులు పూర్తిచేశారు. వదిలేసిన కిలోమీటరు రోడ్డు ప్రస్తుతం అధ్వానంగా తయారైంది. దీంతోపాటు మండల కేంద్రంలో ట్రాఫిక్ రద్దీని తప్పించడానికి నారాయణఖేడ్ రోడ్డు నుంచి బోర్గి క్రాస్‌రోడ్డు బైపాస్ ఏర్పాటు చేసేందుకు నిర్ణయించారు. ఈ పనులు కూడా ప్రారంభించి పదేళ్లయినా పూర్తిచేయలేదు. దీంతో, ఈ రెండు మార్గాల్లో ప్రయాణం నరకప్రాయంగా మారింది. దుమ్ము, దూళితో శ్వాసకోశ వ్యాధులతో సతమతమవుతున్నారు. కంకరరాళ్లు ఎగిరి బయట నిలబడిని వాళ్లకు తగులుతున్నాయి. వర్షం పడిందంటే ఈ రోడ్డు దుస్థితి మాటల్లో చెప్పలేం. గుంతల్లో నీరు నిలిచి బురదమయంగా మారుతుంది. ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇటీవల ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి చొరవ తీసుకొని కిలోమీటరు మేర సిమెంట్ రోడ్డు నిర్మాణం కోసం ఆర్‌డీఎఫ్ ద్వారా రూ.2 కోట్ల నిధులు మంజూరు చేయించారు. ఐదు నెలల క్రితం పనులకు శంకుస్థాపన కూడా చేశారు. కానీ పూర్తిచేయలేదు. దీనిపై ఆర్‌అండ్‌బీ డీఈఈని ఫోన్‌లో సంప్రదించేందుకు ‘ఆంధ్రజ్యోతి’ ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.



కంగ్టి రహదారి గుండా లారీ వెళ్తుండగా లేస్తున్న దుమ్ము



బొంతపల్లి వీరభద్రస్వామి కల్యాణం జరిపిస్తున్న పురోహితులు

కమనీయం.. కల్యాణం

ఘనంగా బొంతపల్లి వీరభద్రస్వామి కల్యాణ మహోత్సవం

గుమ్మడిదల, మార్చి 24: బొంతపల్లి వీరన్నగూడెం వీరభద్ర స్వామి దేవాలయం బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి అగ్నిగుండాలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో వేద మంత్రాల మధ్య అగ్నిగుండం ఏర్పాటు చేయగా, భక్తులు అగ్నిగుండాల్లో నడిచి మొక్కులు తీర్చుకున్నారు. సోమవారం అంగరంగవైభవంగా స్వామి వారి కల్యాణం నిర్వహించారు. దేవాలయ చైర్మన్ మద్ది ప్రతాప్‌రెడ్డి, ఈవో శశిధర్ గ్రామ పెద్దల ఆధ్వర్యంలో పట్టు వస్త్రాలు సమర్పించారు. కల్యాణ మహోత్సవం తిలకించేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. కల్యాణోత్సవం అనంతరం అన్నదానం చేశారు. ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా అధ్యక్షులు కాటా సుధారాణి, తహసీల్దార్ గంగాభవానీ, ఎంపీడీవో రమాదేవి, పీసీసీ సభ్యుడు కొత్తపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీపీలు సద్ది ప్రవీణా భాస్కర్‌రెడ్డి, రవీందర్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీకాంత్‌రెడ్డి, మండల అధ్యక్షులు పట్టు నర్సింగ్‌రావు, వడ్డే కృష్ణ, మాజీ ఆలయ కమిటీ చైర్మన్‌లు సురబి నాగేందర్‌గౌడ్, సద్ది విజయ్ బాస్కర్‌రెడ్డి, గటాటి భద్రప్ప, ఆలేటి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచు ఎం. నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వెళ్లొస్తాం మల్లన్నా..

ఘనంగా కొమురవెల్లి మల్లన్న అగ్నిగుండాలు

• నిప్పుల్లో చిందేసిన భక్తులు, శివసత్తులు
• హాజరైన వీరశైవ జగద్గురు, బర్దీపూర్ దత్తగిరిపీఠం మహామండలేశ్వర డాక్టర్ సిద్దేశ్వరానందగిరి
• ముగిసిన మూడు నెలల జాతర



చేర్యాల, మార్చి 24 : కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల ముగింపులో భాగంగా సోమవారం తెల్లవారుజామున అగ్నిగుండాలను అత్యంత భక్తిప్రపత్తులతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం అర్ధరాత్రి అనంతరం తోటబావి ప్రాంగణంలో ఐదురకాల వంటచెరుకును అమర్చి అగ్నిగుండాలను తయారుచేశారు. వీరశైవుల జగద్గురు బర్దిపూర్ దత్తగిరి పీఠం మహామండలేశ్వర డాక్టర్ సిద్దేశ్వరానందగిరి మహాస్వామి పర్యవేక్షణలో వీరశైవాగమశాస్త్రం ప్రకారం శాస్త్రోక్తయుక్తంగా, సంప్రదాయబద్ధంగా నిత్యార్చనలు, మహాగణపతి పూజ, ఋత్విగ్వరణం, స్వస్తిపుణ్యహవాచనం, నాంది సమారాధాన, ఏకాదశరుద్రపూజ, సప్తమాతృకపూజ, జగద్గురు పంచాచార్య పూజ, వీరభద్ర పళ్లెరం, భద్రకాళి పూజ,

మిగతా 7వ పేజీలో



అగ్నిగుండాలు దాటడం ప్రారంభిస్తున్న అర్చకులు

రంజాన్ వేళలు
ఇఫ్తార్: 6:34 (మంగళవారం సాయంత్రం)
సహర్: 4:54 (బుధవారం ఉదయం)

తూప్రాన్ విద్యుత్ సబ్ డివిజన్‌కు వాహనం


వాహనానికి పూజలు

తూప్రాన్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): తూప్రాన్ పట్టణ పరిధి పోతరాజుపల్లి శివారులో విద్యుత్ సబ్ డివిజన్ కార్యాలయానికి ఇసూజీ వాహనం కేటాయించినట్లు విద్యుత్ డీఈ గరత్ మంత్‌రావు తెలిపారు. తూప్రాన్ విద్యుత్ సబ్ డివిజన్ పరిధిలోని తూప్రాన్, కాళ్లకల్ (మనోహరాబాద్), శివ్వంపేట, వెల్దుర్తి, మాసాయిపేట సెక్షన్లలో పనులకు ఉపయోగించేందుకు ఇసూజీ వాహనం అందజేశారు. నాచగిరి లక్ష్మీనర్సింహస్వామి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల్లో తూప్రాన్ విద్యుత్ డీఈ గరత్‌మెంత్ రావు, ఏడీఈ శ్రీనివాస్, ఏఈ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నర్సాపూర్ తైబజార్ వేలం రూ.30.10 లక్షలు

నర్సాపూర్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ మున్సిపాలిటీ పరిధిలో తైబజార్ వేలం పాటలో రూ.30.10 లక్షలకు సందీప్ దక్కించుకున్నాడు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ రామకృష్ణారావు ఆధ్వర్యంలో వేలం పాట నిర్వహించగా పశువుల సంతను రూ.3.50 లక్షలకు చింతకుంట శ్రీకాంత్ దక్కించుకున్నాడు.

పేట పంచాయతీ తైబజార్ వేలం రూ.9.20 లక్షలు

పెద్దశంకరంపేట, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : పెద్దశంకరంపేట గ్రామపంచాయతీ అభివృద్ధికి తైబజార్ వేలం ద్వారా రూ.9.20 లక్షల ఆదాయం సమకూరినట్లు మెదక్ డీఎల్పీవో సురేష్‌బాబు తెలిపారు. సోమవారం పెద్దశంకరంపేటలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో తైబజార్ వేలంపాట వేశారు. పెద్దశంకరంపేటకు చెందిన పోచయ్య రూ.9.20 లక్షలకు పాట పాడి తైబజార్ దక్కించుకున్నారు.

శివ్వంపేట తైబజార్ వేలం రూ.3.42 లక్షలు

శివ్వంపేట, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన శివ్వంపేట పంచాయతీ తైబజార్ అంగడి బహిరంగ వేలం సోమవారం ప్రత్యేక అధికారి కమలాద్రి ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి రమాదేవి సమక్షంలో నిర్వహించారు. శివ్వంపేట గ్రామానికి చెందిన సురేష్ రూ.3.42 లక్షలకు దక్కించుకున్నాడు.

నేడు అల్లాదుర్గం తైబజార్ వేలం

అల్లాదుర్గం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 25న అల్లాదుర్గం తైబజారు వేలం పాటను నిర్వహిస్తున్నట్లు గ్రామపంచాయతీ కార్యదర్శి కే.ప్రభాకర్ తెలిపారు. ఉదయం 10 గంటలకు మండల అభివృద్ధి అధికారి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించే వేలంలో ఆసక్తి గలవారు రూ.5 వేలు చెల్లించి పాల్గొనాలన్నారు.

వేర్వేరు కారణాలతో ఇద్దరి ఆత్మహత్య



అనిల్‌కుమార్(ఫైల్), నర్సింలు(ఫైల్)

వెల్దుర్తి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : అప్పులబాధతో ఓ యువకుడు పురుగుల మందు తాగి సోమవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వెల్దుర్తి మండలం శెట్టిపల్లి గ్రామానికి చెందిన పడిగే అనిల్‌కుమార్(26) పౌల్ట్రీ పాం కోసం, ఇంటి అవసరాల నిమిత్తం, అలాగే ట్రాక్టర్ కొనుగోలుకు సుమారు రూ.15 లక్షల వరకు అప్పులు చేశాడు. చేసిన అప్పులు ఎలా తీర్చాలని మనస్తాపంతో ఈ నెల 21న పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతిచెందాడు. మృతుడికి భార్య దీప, మూడునెలల కూతురు ఉన్నారు. మృతుడి మేనమామ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కుటుంబ కలహాలతో..

రామచంద్రాపురం టౌన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురైన వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన రామచంద్రాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ రామకృష్ణ వివరాల ప్రకారం.. పటాన్‌చెరు డివిజన్ పరిధి బండ్లగూడ గ్రామానికి చెందిన వడ్డె రాజు(41) ప్రైవేటు సంస్థలో పని చేస్తున్నాడు. కొన్నిరోజులుగా కుటుంబసభ్యులతో కలహాలు రావడంతో ముభావంగా ఉంటున్నాడు. ఆదివారం రాత్రి శ్మశానంలోని వేపచెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తమ్ముడు మహేష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

చేపల వేటకు వెళ్లి యువకుడు..

శివ్వంపేట, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : చేపల వేటకు వెళ్లిన వ్యక్తి వల చుట్టుకుని మృతిచెందాడు. శివ్వంపేట మండలం దొంతి గ్రామానికి చెందిన కట్లే నర్సింలు(49) ఆదివారం ఉదయం స్థానిక కుందలమ్మ చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లాడు. చెరువులో వల విసురుతున్న క్రమంలో చేతికి వల చుట్టుకొని చెరువులో ఈదలేక నీట మునిగి మృతిచెందాడు. రాత్రి అవుతున్నా నర్సింలు ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. కాగా సోమవారం చెరువులో మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడి భార్యకు మాటలు రాకపోవడంతో సోదరుడు పోచయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్‌ఐ మధుకర్‌రెడ్డి తెలిపారు.

అరగంట ముందే పాఠశాలకు తాళం


పాండ్యాతండాలో తాళం వేసి ఉన్న పాఠశాల

శివ్వంపేట, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఒంటిపూట బడులు కూడా తూతూ మంత్రంగా నిర్వహిస్తున్నారు. కొన్ని చోట్ల ఉపాధ్యాయులు సమయ పాలన పాటించడం లేదు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఇలా వచ్చాం.. అలా వెళ్లాం అన్నట్లుగా కొందరు వ్యవహరిస్తున్నారు. మండల పరిధిలోని రెండు పాఠశాలలకు సోమవారం అరగంట ముందే తాళాలు వేసి ఉపాధ్యాయులు వెళ్లిపోయారు. వాస్తవంగా మధ్యాహ్నం 12.30 వరకు ఒంటిపూట బడులు నడపాల్సి ఉండగా, మండల పరిధిలోని రూప్లా తండా, పాండ్యా తండా ఉపాధ్యాయులు 12 గంటలకే తాళం వేశారు. ఈ పాఠశాలల్లో 11.30 గంటలకే మధ్యాహ్న బోజనాన్ని పెట్టి పాఠశాలకు తాళం వేసి వెళ్లారు. 12.10కి పాండ్యాతండా ఉపాధ్యాయుడు తాళం వేసి వెళ్లగా, చౌరస్తాలో కనిపిస్తే ప్రశ్నించగా, వేతనాల కోసం ఎంఆర్సీకి వెళ్తున్నానని చెప్పడం గమనార్హం. ఈ విషయమై జిల్లా విద్యాధికారిని సంప్రదించగా, విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

బాలికను లోబర్చుకున్న యువకుడు

శివ్వంపేట, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఓ బాలికకు మాయమాటలు చెప్పిన ఓ వ్యక్తి ఆమెను లోబర్చుకున్నాడు. మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక ఇంటర్ చదువుతోంది. అప్పటికే పెళ్లి అయి పిల్లలు ఉన్న ఓ వ్యక్తి ఆమెతో పరిచయం పెంచుకుని మాయమాటలు చెప్పాడు. ఇటీవల ఆమెను బయటకు తీసుకెళ్లాడు. ఈ విషయం అతని భార్యకు తెలియడంతో విషయం వెలుగుచూసింది. దీంతో బాధిత బాలిక కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించినట్లు సమాచారం.



తూప్రాన్ పోలీస్‌స్టేషన్ వద్ద ఆశావర్కర్లు

టోల్‌ప్లాజా వద్ద వాహనాల తనిఖీ

- హైదరాబాద్ వెళ్తున్న ఆశాల ముందస్తు అరెస్టు
- తూప్రాన్, మనోహరాబాద్, వెల్దుర్తి పోలీస్‌స్టేషన్లకు తరలింపు

తూప్రాన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఆశా వర్కర్లు చేపట్టిన 'చలో హైదరాబాద్' నేపథ్యంలో సోమవారం తూప్రాన్ పట్టణం అల్లాపూర్ శివారులోని టోల్ ప్లాజా వద్ద పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహించారు. హైదరాబాద్ తరలి వెళ్తున్న ఆశా వర్కర్లను అరెస్టు చేశారు. ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి, కరీంనగర్, మెదక్ జిల్లాల నుం చి హైదరాబాద్ వెళ్తున్న ఆశా వర్కర్లను అడ్డుకోవడానికి తూప్రాన్ టోల్‌ప్లాజా మనోహరాబాద్, తూప్రాన్, శివ్వంపేట, వెల్దుర్తి పోలీసుల ఆధ్వర్యంలో చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. హైదరాబాద్ వైపు వెళ్లే ప్రతీ వాహనం తనిఖీ చేశారు. పలువురు ఆశా వర్కర్లను ముందస్తు అరెస్టు చేసి తూప్రాన్, మనోహరాబాద్, వెల్దుర్తి పోలీసుస్టేషన్లకు తరలించారు. అరెస్టు చేసిన 40 మంది ఆశా వర్కర్లను తూప్రాన్ పోలీసుస్టేషన్‌కు తరలించారు. సాయంత్రం వరకు స్టేషన్‌లో ఉంచి సొంత పూచికత్తుపై విడుదల చేశారు.

పరిశ్రమల రక్షణపై ఎస్పీ ఆరా

ఐడీఏబొల్లారం మార్చి 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా కొత్త పోలీస్ బాస్ ఎస్పీ పరితోష్ పంకజ్ సోమవారం ఐడీఏబొల్లారం పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. ఈ ప్రాంతంలో పరిశ్రమలు ఎక్కువగా ఉండటంతో పరిశ్రమలకు సంబంధించిన భద్రతా వ్యవహారాలపై వివరాలు సీఐ రవీందర్‌రెడ్డిని అడిగితెలుసుకున్నారు. ఐడీఏబొల్లారం, ఖాజిపల్లి, గడ్డపోతారం పారిశ్రామికవాడల వైశాల్యం పరిశ్రమల సంఖ్య, పని చేస్తున్న కార్మికుల సంఖ్యతోపాటు నివాసాల ప్రాంతాలు, నేరాలపై ప్రభావం, ఇతర రాష్ట్రాల కార్మికుల కదలికలు నేర ప్రవృత్తి వంటి అంశాలపై చర్చించారు. అనంతరం ఏడాదిలో జరిగిన నేరాల వివరాలు నమోదు ప్రక్రియలను పరిశీలించారు. పారిశ్రామికవేత్తలకు ఎప్పటికప్పుడు భద్రతాపరమైన రక్షణ చర్యలు చేపడుతున్న విధానాలను అడిగారు.



వివరాలు తెలుసుకుంటున్న ఎస్పీ

టీబీ రహిత సమాజం కోసం కృషి చేయాలి



వరల్డ్ టీబీ డే ర్యాలీలో డీఆర్‌వో పద్మజారాణి, వైద్య అధికారులు, సిబ్బంది

సంగారెడ్డి అర్బన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): టీబీ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డీఆర్‌వో పద్మజారాణి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రమేశ్ పేర్కొన్నారు. ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా సంగారెడ్డిలో సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. జెడ్పీ కార్యాలయం వద్ద డీఆర్‌వో పద్మజారాణి ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ డీఎంహెచ్‌వో ఆఫీస్ వరకు కొనసాగింది. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ క్షయ నివారణకు అన్ని ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా మందులు అందిస్తారని, రోగులు వినియోగించుకోవాలని సూచించారు. క్షయ వ్యాధి ఆదిలోనే గుర్తించి చికిత్స పొందాలని కోరారు. అనంతరం నిక్షయ్ మిత్రులకు న్యూట్రిషన్ కిట్స్ అందించారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన క్షయ నివారణ సిబ్బంది, టీబీ అలర్ట్ ఎన్‌జీవో, భవ్య ఎన్‌జీవో, టీబీ చాంపియన్‌లకు, నిక్షయ్ మిత్రలను సన్మానించి మెమోంటోలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డా.గాయత్రీదేవి, డిప్యూటీ డీఎంహెచ్‌వో డా.సంధ్యరాణి, డీటీసీవో డా.అరుణకుమారి, డీసీహెచ్ఎస్ డా.సంగారెడ్డి, డెమో ప్రసాద్, డిప్యూటీ డెమో మంగ, డీఎల్‌వో డా.మహేందర్‌రెడ్డి, డా.చక్రపాణి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్షయ నిర్మూలన అందరి బాధ్యత

సిద్దిపేట టౌన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): క్షయ నిర్మూలన అందరి బాధ్యత అని సిద్దిపేట డీఎంఅండ్ హెచ్‌వో డాక్టర్ పల్వన్‌కుమార్ సూచించారు. సోమవారం డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయంలో ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా అధికారులు, సిబ్బందితో కలిసి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షయ వ్యాధిని త్వరతగతిన గుర్తించి, వ్యాధి తీవ్రత పెరగకుండా చూడాలన్నారు. అందరి సమష్టి కృషితో క్షయరహిత జిల్లాగా మారుద్దామన్నారు. క్షయ నియంత్రణ ఇన్‌చార్జి డాక్టర్ అరుణ్‌కుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌వో, ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఆనంద్, ప్రోగ్రాం అధికారి ఎన్‌సీడీ డాక్టర్ నారాయణరావు, ప్రోగ్రాం అధికారి డాక్టర్ శ్రీకళ, సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ పల్వన్‌కుమార్

యూత్ పార్లమెంట్ సువర్ణ అవకాశం



మాట్లాడుతున్న డాక్టర్ పల్వన్‌కుమార్

మెదక్ అర్బన్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): యువత తమ అభిప్రాయాలు చెప్పే సువర్ణ అవకాశాన్ని వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ కల్పించిందని జిల్లా అదనపు ఎస్పీ మహేందర్ పేర్కొన్నారు. యువ ఉత్సవ్ 2025లో భాగంగా సోమవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెండు రోజుల పాటు జరుగనున్న జిల్లా స్థాయి యూత్ పార్లమెంట్ ఉత్సవాలను అదనపు ఎస్పీ మహేందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ భవిష్యత్తు నేటి యువతపైనే ఉందన్నారు. పార్లమెంట్‌లో సైతం తమ అభిప్రాయాలను తెలిపే సువర్ణ అవకాశమని, యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వన్ నేషన్- వన్ ఎలక్షన్ అనే అంశంపై మెదక్- సంగారెడ్డి, కామారెడ్డి జిల్లాలకు సంబంధించి యువత రెండు రోజులపాటు 75 మంది చొప్పున మూడు నిమిషాలు ప్రసంగించనున్నారు. ఇందులో ప్రతిభ కనబరిచిన 10 మందిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేయనున్నట్లు కమిటీ తెలిపింది. రాష్ట్రస్థాయిలో ఎంపికైన విజేతలు పార్లమెంట్ మాట్లాడే అవకాశం పొందుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డా.హుస్సేన్, డీఆర్డీఏ పీడీ శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు.

పంట పొలాల్లోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

బెజ్జంకి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): అదుపుతప్పి ఓ ఆర్టీసీ బస్సు పంట పొలాల్లోకి దూసుకెళ్లిన సంఘటన బెజ్జంకి మండలం ముత్తన్నపేట శివారులో సోమవారం చోటుచేసుకుంది. కరీంనగర్-1 డిపోకు చెందిన ఆర్టీసీ (పల్లెవెలుగు) బస్సు కరీంనగర్ నుంచి బెజ్జంకి మండల కేంద్రానికి 41 మంది ప్రయాణికులతో బయలు దేరింది. ఈ క్రమంలో ముత్తన్నపేట స్టేజీ సమీపంలోని కల్వర్టు వద్దకు రాగానే ఒక్కసారిగా అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న పంట పొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ప్రయాణికులెవరికీ ఏమీ కాలేదు. బస్సులో ఉన్న వారంతా ప్రైవేట్ వాహనాల్లో తమతమ గమ్యస్థానాలకు వెళ్లిపోయారు.



తెల్ల'బంగారమే'..!

అధిక సాంద్రతతో అనేక లాభాలు

తక్కువ సమయం.. ఎక్కువ దిగుబడి

చీడపీడలు రాకముందే పంట చేతికి..

ఎకరాకు 15 క్వింటాళ్ల పత్తి

పెరుగుతున్న సాగు విస్తీర్ణం

గజ్వేల్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): రైతులు సాగులో నూతన పద్ధతులు పాటిస్తూ అధిక దిగుబడులు సాధిస్తున్నారు. పత్తి సాగు చేస్తే అప్పులే అన్న మాటను అబద్ధం చేస్తూ.. అధికసాంద్రత విధానంలో సాగు చేసి.. పత్తిసాగు భలే బాగు అంటున్నారు. తక్కువ పెట్టుబడి.. ఎక్కువ లాభాలు వస్తుండటంతో రైతులు అధిక సాంద్రత పత్తి సాగు వైపు మొగ్గుచూపుతున్నారు. ఇందుకు వ్యవసాయ అధికారుల సలహాలు.. సూచనలు కూడా తోడు కావడంతో జిల్లాలో అధిక సాంద్రత పత్తి సాగు ఏటా పెరుగుతోంది.

మూడేళ్ల క్రితం పైలట్ ప్రాజెక్టుగా సిద్దిపేట జిల్లాలో పంట సాగును చేపట్టగా, మొదటి ఏడాది 1040 ఎకరాల్లో అధిక సాంద్రత పత్తిపంటను రైతులు సాగు చేశారు. రెండో ఏడాది 2వేల ఎకరాల్లో సాగు చేయగా, ఈ ఏడాది దాదాపుగా 3వేల ఎకరాల్లో అధిక సాంద్రత పత్తిని సాగు చేశారు. ఈ పంట ద్వారా రైతులు లాభాలే తప్ప నష్టం లేదని స్వయంగా సాగు చేసిన రైతులే చెబుతున్నారు. ఈ యేడు గజ్వేల్ మండల పరిధిలోని అక్కారం, దాతర్‌పల్లి, అహ్మదీపూర్ గ్రామాల్లో అధిక సాంద్రత పద్ధతిలో పత్తిని సాగు చేయగా, మర్కుక్ మండల కేంద్రంతోపాటు నర్సన్నపేట, ఎర్రవల్లి, పాములపర్తి గ్రామాల్లో, రాయపోల్ మండలంలోని పలు గ్రామాల్లో అధిక సాంద్రత పత్తిని సాగు చేశారు. ఇటీవల కాలంలో ప్రభుత్వ ప్రత్యేక శ్రద్ధతో పాటు కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు, అధికారులు అధిక సాంద్రత విధానంలో పత్తిని సాగు చేయాలని రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. ఇటీవలే రాయపోల్ మండలంలో రైతులకు ఈ విధానంలో సాగుపై ప్రత్యేక శిక్షణను ఇచ్చారు.

విత్తే, సాగు చేసే విధానం వేరు..

పత్తి పంటను సాధారణంగా శాస్త్రీయపద్ధతిలోనే దశాబ్దాలుగా రైతులు సాగుచేస్తున్నారు. రానురాను పత్తి విత్తే పద్ధతితో పాటు సాగు చేసే విధానంలోనే తేడా సుస్పష్టంగా కనిపిస్తుంది. దేశంలో సాగు చేస్తున్న సాంప్రదాయ విధానంలో ఎకరాకు కేవలం 8వేల మొక్కలను నాటుతుండడంతో దిగుబడి ఐదు నుంచి ఏడు క్వింటాళ్లు వస్తుంది. దీంతో రైతు శారీరక, మానసిక కష్టంతో పాటు, పెట్టుబడి రాని పరిస్థితి నెలకొంటుంది. సాధారణంగా జిల్లాలో 90/60 రేషియోలో పత్తిని సాగు చేస్తుండగా, అధిక సాంద్రత పత్తిలో 90/30 పద్ధతిలో సాగుచేస్తున్నారు. దీంతో ఎకరంలో 29వేల మొక్కలను నాటుతున్నారు. దాదాపుగా వెయ్యి నుంచి రెండు వేల మొక్కలు పోగా, దాదాపుగా 25 వేల మొక్కలు బతుకుతున్నాయి. ఈ 25వేల మొక్కలకు ఒక్కో మొక్కకు 20 నుంచి 25కాయలు వస్తున్నాయి. ఒక్కో కాయలో వచ్చే పత్తి బరువు 4గ్రాములుగా ఉంటుంది. దీంతో దాదాపుగా ఎకరాకు సరాసరి 15నుంచి 16క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నారు.

ఐదు రకాల ప్రయోజనాలు

అధిక సాంద్రత పత్తి సాగుతో ఐదు రకాల ప్రయోజనాలు రైతులకు చేకూరనున్నాయి. మొదటగా రైతులు సాగుచేసే పంటకు ప్రతి ఎకరాకు ప్రభుత్వం రూ.4వేలు అందించనుంది. పత్తి పంట కాలం కేవలం 145 రోజులలో ముగుస్తుండడంతో యాసంగిలో మరోపంట వేసుకునే వీలుంది. అంతేకాకుండా 145 రోజులలో పంట కాలం ముగుస్తుండడంతో పింక్ బోల్ వార్మింగ్(గులాబీ రంగు పురుగు) వచ్చే అవకాశాలు తక్కువగా ఉన్నాయి. సాధారణంగా గులాబీ రంగు పురుగు వంద రోజులు దాటిన అనంతరం పంటలను ఆశిస్తుంది. కానీ. అప్పటికే గూడ, కాత రావడంతో పత్తికి పెద్దగా నష్ట కలిగే అవకాశాలు ఉండవు. ప్రతి ఏటా సెప్టెంబరులో భారీ వర్షాలు కురుస్తుండడంతో వర్షానికి గూడ రాలిపోయే అవకాశాలున్నాయి. సెప్టెంబరులో అధిక సాంద్రత పత్తిలోని గూడ కాయగా మారడంతో గూడ రాలే ప్రమాదం నుంచి తప్పించుకోవచ్చని అధికారులు చెబుతున్నారు.



గజ్వేల్ మండలం అహ్మదీపూర్‌లో అధిక సాంద్రత విధానంలో సాగు చేసిన పత్తిపంట

దిగుబడి బాగుంది..

అధిక సాంద్రత పత్తితో దిగుబడి బాగుంది. వాస్తవానికి సాధారణ పత్తి సాగులో ఎకరాకు ఆరు నుంచి ఎనిమిది క్వింటాళ్ల దిగుబడి వచ్చేది. అధిక సాంద్రత పత్తి సాగు విధానంలో ఎకరాకు పదిహేను క్వింటాళ్ల పత్తి దిగుబడి వచ్చింది. నేను రెండు ఎకరాల్లో పత్తిని సాగుచేశారు. దాదాపుగా 34 క్వింటాళ్ల పత్తి దిగుబడి వచ్చింది. జూన్ చివరి వారంలో పత్తిని నాటాను. నవంబరు నాటికి పంట చేతికి వచ్చింది. డిసెంబర్‌లో సన్‌ఫ్లవర్‌ను సాగు చేశా. ఆ పంట కూడా చేతికి వస్తుంది. రైతులు ఈ విధానంలో పత్తిని సాగు చేసి మంచి దిగుబడులు పొందవచ్చు. చీడపీడలు ఆశించే సమయానికి పంట కాలం పూర్తవుతుంది. నావరకు అయితే వచ్చే ఏడాది ఇదే విధానంలో పత్తిని సాగు చేస్తా.

-సింగిరెడ్డి ముత్యంరెడ్డి, రైతు, అహ్మదీపూర్

అధికసాంద్రత పత్తితో అధిక రాబడులు



అధిక సాంద్రత పత్తి సాగుతో రైతుకు అధిక రాబడి వస్తుంది. ఈ పత్తి సాగుతో మరోపంటకు అవకాశం లభిస్తుంది. పత్తికి గులాబీ రంగు పురుగు ఆశించే అవకాశాలు చాలా తక్కువగా ఉంటాయి. ఈ పత్తి సాగు విజయవంతం అయింది. ఈ ఏడాది 25వేల మొక్కల సాగు పూర్తి చేశారు. వానాకాలంలో పంట నవంబరులోనే పూర్తికావడంతో డిసెంబరులో యాసంగి పంటను రైతులు సాగు చేశారు. గజ్వేల్ డివిజన్ పరిధిలోని ఆయా గ్రామాల్లో అధిక సాంద్రతలో పత్తిని సాగు చేయడానికి రైతులు ముందుకు వస్తున్నారు.

- బాబునాయక్, గజ్వేల్ ఏడీ



తల్లిని భుజాలపైకి ఎత్తుకుని అగ్నిగుండం దాటుతున్న భక్తుడు

వెళ్లొస్తాం..మల్లన్నా

5వ పేజీ తరువాయి..

మునలఖడ్గపూజ, సుంకు, అగ్నిప్రతిష్ట, సుప్రభాత పూజ, ఇంద్రాది అష్టదిక్పాలకులకు బలిహరణ, అగ్నిగుండార్చన, శాంతిపూజ, అగ్ని గుండ ప్రవేశ పూజలు జరిపారు. ఆయా దేవతలను స్తుతిస్తూ దండకాలు వేశారు. అష్టదిక్కులా గుమ్మడికాయలతో బలిహరణ జరిపారు. జగద్గురు సిద్దేశ్వరానందగిరి మహాస్వామి రాక పాద పూజ జరిపారు. అర్చకులు వీరభద్రుడి విజయ ఖడ్గం తీసుకొచ్చి ఆవాహనం అనంతరం మల్లన్నను కీర్తిస్తూ గుండాలు దాటడాన్ని ప్రారంభించారు. శివసత్తులు, భక్తులు, ఆచారవతులు పూనకంతో కణకణరగిలే నిప్పుల అగ్నిగుండాలను దాటి మొక్కులు తీర్చుకున్నారు. గుండాలు దాటాం..మా గండాపు బాపు అంటూ స్వామివారిని దర్శించుకున్నారు. తమను చల్లగా కాపాడాలని వేడుకున్నారు. మల్లన్న చరిత్రను, అగ్నిగుండాల విశిష్టతను తెలంగాణ రాష్ట్ర ఆగమ వాస్తు సలహా కమిటీ సభ్యులు డాక్టర్ మహంతయ్యస్వామి కనులకు కట్టినట్లుగా భక్తులకు వివరించారు. కార్యక్రమంలో ఈవో రామాంజనేయులు, ధర్మకర్తలు జయప్రకాశ్‌రెడ్డి, లింగంపల్లి శ్రీనివాస్, అంజిరెడ్డి, మోహన్‌రెడ్డి, ఏఈవో బుద్ధి శ్రీనివాస్, సూపరింటెండెంట్‌లు సురేందర్‌రెడ్డి, శ్రీరాములు పాల్గొన్నారు. చేర్యాల సీఐ శ్రీను ఆధ్వర్యంలో పోలీసు అధికారులు, సిబ్బంది బందోబస్తు చర్యలు చేపట్టారు.

ఘనంగా ఏకాదశ రుద్రాభిషేకం

అగ్నిగుండాల కార్యక్రమ నిర్వహణ అనంతరం సోమవారం మల్లన్న ఆలయంలో వీరశైవార్చకులు విజయోత్సవం, ఏకాదశ రుద్రాభిషేకం, జంగమార్చన తదితర పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.

బుకింగ్ ఆదాయం రూ.70లక్షలు

చివరివారం సందర్భంగా భక్తులు భారీగా తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఈ క్రమంలో శనివారం రూ.6.66లక్షలు, ఆదివారం రూ.54,96లక్షలు, సోమవారం సుమారు రూ.8లక్షలుమేర బుకింగ్ ఆదాయం సమకూరిందని ఆలయ వర్గాలు తెలిపాయి.

కొమురవెల్లికి మళ్లొస్తాం..

గత డిసెంబరు 29న జరిగిన కల్యాణంతో ప్రారంభమైన మల్లన్న బ్రహ్మోత్సవాలు సోమవారం తెల్లవారుజామున నిర్వహించిన అగ్నిగుండాలతో ముగిశాయి. మూడునెలలపాటు 10వారాలు ప్రతీ ఆదివారం సాగిన జానపదుల మహాజాతరకు తెరపడింది. చివరి ఘట్టమైన అగ్నిగుండాలకు తరలివచ్చిన భక్తులు సోమవారం మూటముల్లె సర్దుకుని వెనుదిరిగారు. "కోరిన కోర్కెలు తీర్చుతూ కొంగుబంగారంగా పూజలందుకుంటున్న మల్లన్న స్వామి వెళ్లొస్తాం.. వచ్చే యేడు మళ్లొస్తామని" అంటూ ఇంటిముఖం పట్టారు. దీంతో ఎటుచూసినా కిటకిటలాడిన ఆలయ పరిసరాలన్నీ బోసిపోయాయి.



జాతర ముగియడంతో తిరుగు ప్రయాణంలో భక్తులు



ఉత్సాహంగా అగ్నిగుండాలు దాటుతున్న పోలీసు సిబ్బంది

చేతులు కలిపారు..

సీఎంను కలిసిన మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ అధికార ప్రతినిధి



గజ్వేల్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్ రావులు చేతులు కలిపారు. కొన్ని రోజులుగా ఉప్పు, నిప్పులా ఉన్న వీరిద్దరిని కలపాలని, గజ్వేల్‌లో వర్గాలు లేకుండా చూడాలని కాంగ్రెస్ అధిష్ఠానం ముఖ్యంగా టీపీసీసీ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ సంకల్పం నెరవేరింది. నేరుగా సీఎం సమక్షంలోనే ఇరువురు చేతులు కలిపి, గజ్వేల్ లో వర్గాలకు చెక్ పెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏఐసీసీ, టీపీసీసీ, ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు పార్టీని బలోపేతం చేస్తూ, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్తామని పేర్కొన్నట్లు తెలిసింది. వీరి ఫోటో గజ్వేల్ నియోజకవర్గ సోషల్ మీడియాలో వైరల్ అయింది.

కోవర్టు రాజకీయాలకు పెట్టింది పేరు బీఆర్ఎస్

మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు

నర్సాపూర్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): కోవర్టు రాజకీయాలకు బీఆర్ఎస్ పేరుగాంచిందని, ఆ పార్టీ నాయకులు ప్రభుత్వంపై చేసే విమర్శలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే హన్మంతరావు పేర్కొన్నారు. సోమవారం డీసీసీ అధ్యక్షులు ఆంజనేయులుగౌడ్ అధ్యక్షతన నర్సాపూర్‌లో నిర్వహించిన జిల్లా ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ పదేళ్లపాటు అధికారంలో ఉండి కూడా ప్రజలకు చేసింది ఏమీ లేదని, కేవలం కేసీఆర్ కుటుంబం ఆస్తులు పెంచుకుందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి పదిహేను నెలలోనే ఎన్నో సంక్షేమ, అభివృద్ధి పథకాలు అమలు చేస్తున్నా వాటిని పూర్తిస్థాయిలో ప్రచారం చేయలేకపోతున్నామన్నారు. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు రానున్నందున ప్రతి గ్రామంలో పార్టీ కార్యకర్తలు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను విస్తృత ప్రచారం చేస్తు ఎన్నికలలో అత్యధిక స్థానాలు గెలిచి సత్తా చాటాలన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కూడా మత రాజకీయాలు తప్పా ప్రజలకు చేసేదేమీ లేదన్నారు. భారత రాజ్యాంగాన్ని దెబ్బతియాలనే కుట్ర పన్నుతున్నారని దానిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. మత విద్వేషాలను రెచ్చగొట్టి పబ్బం గడుపుకోవడానికి బీజేపీ ప్రయత్నిస్తుందని రాష్ట్రంలో ఆ పార్టీ ఇప్పట్లో అధికారంలో వచ్చే అవకాశమే లేదన్నారు. కార్యక్రమంలో బీసీ కార్పొరేషన్ చైర్మన్ శ్రీకాంత్‌గౌడ్, ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ సుకుమార్, పీసీసీ ఉపాధ్యక్షులు శ్రావణ్‌కుమార్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆవులరాజిరెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు రాజుయాదవ్, వెంకట్రామ్‌రెడ్డి, బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షులు, మండల పార్టీ అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న నాయకులు



అయితే.. మాకేంటీ?

పైసలొచ్చే పనులకే మొగ్గు.. కనీస సౌకర్యాలు వద్దు

జిల్లాలో రూ.74 కోట్లతో ఈజీఎస్ పనులు

రూ.72 కోట్లు సీసీ రోడ్లకే..

'మురికి'కూపాలుగా గ్రామాలు

దుబ్బాక, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): 'ఏదైనా పని చేస్తే మనకు మిగిలేది ఎంత? మన అనుచరులకు గిట్టుబాటు అవుతుందా?' ఇదే ఇప్పటి నేతల ఆలోచన. 'నేతలు చెప్పారు మనదేం పోయింది వారు చెప్పినట్లు చేద్దాం.' ఇది అధికారుల తీరు. అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించాలనే ఆలోచనను మర్చిపోయారు. నిబంధనలు పక్కన పెడుతున్నారు. జిల్లాలో ఆఘమేఘాల మీద మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద సుమారు రూ. 74 కోట్ల 94 లక్షల విలువైన సుమారు 768 పనులు చేపడుతున్నారు. వాస్తవానికి ఈజీఎస్ ప్రతిపాదనల్లో గ్రామాల్లో మురికికాలువలు, సీసీ రోడ్లు వేయాలనే నిబంధన ఉంది. కానీ, రూ. 72 కోట్లు కేవలం సీసీ రోడ్ల పనులకే కేటాయించారు. ఎంపీ, ఎమ్మెల్యేల ప్రతిపాదనలతో ఈ పనులకు నిధులు కేటాయించినట్లు సమాచారం. మిగిలిన రూ. 2 కోట్లతో అంగన్‌వాడీ, గ్రామ పంచాయతీ భవనాలు నిర్మిస్తున్నారు. ఇందులో ఒక్క రూపాయి కూడా గ్రామాల్లో మురికి కాలువలకు కేటాయించలేదు. సీసీ రోడ్ల పనులు అయితే తూతూ మంత్రంగా పూర్తి చేసి, నిధులు మిగిల్చుకుని వాటాలు పంచుకోవచ్చుననే ఆలోచనతో ఈ పనులకు అధిక శాతం నిధులు కేటాయించినట్లు ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి.

మురికికాలువలు లేని గ్రామాలెన్నో..

జిల్లాలో 499 గ్రామాలు ఉండగా, మురికికాలువలు లేని గ్రామాలు ఎన్నో ఉన్నాయి. అసలే గ్రామ పంచాయతీల్లో నిధులు లేక పారిశుధ్య పనులు కూడా చేసే పరిస్థితులు లేవు. ఈ క్రమంలో మురికి కాలువల నిర్మాణాన్ని చేపట్టడం జీపీలకు తలకు మించిన భారంగా మారింది. ఈజీఎస్ నిధులతో గ్రామాల్లో మురికికాలువలు నిర్మిస్తే సమస్య కొంతలో కొంతైన పరిష్కారం అయ్యేది. మురికి కాలువలు లేక మురుగు నీరంతా తాగునీటి పైప్‌లైన్లు, గేట్‌వాల్‌లలో చేరి జనం రోగాల బారిన పడుతున్నారు.

జీపీలకు భవనాలు లేవు..

జిల్లాలో సుమారు 267కుపైగా గ్రామ పంచాయతీలకు సొంత భవనాలు ఉన్నాయి. మిగిలిన జీపీ కార్యాలయాలన్ని అద్దె భవనాల్లో సాగుతున్నాయి. దీంతో కొన్ని జీపీల్లో రికార్డుల భద్రత ప్రశ్నార్థకంగా మారింది. జిల్లాలో 1150 అంగన్‌వాడీలు ఉండగా, 468 అంగన్‌వాడీలకే సొంత భవనాలు ఉన్నాయి. ఈజీఎస్ కింద 26 గ్రామాల్లోని అంగన్‌వాడీలకు భవనాలు నిర్మించేందుకు రూ. 8లక్షల చొప్పున నిధులు మంజూరు చేసినప్పటికీ, కేవలం 5 భవనాల పనులే ప్రారంభించారు. ఈజీఎస్ కింద చేపట్టిన పనులన్నీ ఈనెల 25 వరకు పూర్తికావల్సి ఉండగా, నారాయణరావుపేట మండలంలో ఒక్కటి, హుస్నాబాద్ మండలం బెజ్జంకి, నర్సింలపల్లె, జగదేవ్‌పూర్ మండలం గొల్లపల్లి, కుకునూర్‌పల్లి మండలం బొప్పాయిపల్లి గ్రామాల్లో పునాదుల వరకే పనులు అయ్యాయి.



హసన్‌మీరాపూర్‌లో మురికికాలువ పరిస్థితి

న్యూస్ బాక్స్

ఇంటి పన్ను చెల్లించండి

నారాయణఖేడ్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : ఖేడ్ మున్సిపాలిటీ వాసులు 2024-25 ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నందున ఇంటి పన్నులు, వృత్తి, వ్యాపార లైసెన్సులు, నల్లా బిల్లులు వెంటనే చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలని మున్సిపాలిటీ కమిషనర్ జగ్జీవన్ కోరారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇంటి పన్నులు సకాలంలో చెల్లించని వారిపై మున్సిపాలిటీ చట్టం-2019 ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

విదేశీ విద్యానిధి స్కాలర్‌షిప్‌నకు దరఖాస్తులు

సంగారెడ్డి అర్బన్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : అంబేడ్కర్ విదేశీ విద్యానిధి పథకం కింద 2024-25 కు సంబంధించి జిల్లాలో ఎస్సీ కులాలకు చెందిన విద్యార్థుల స్కాలర్‌షిప్‌ల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి అఖిలేష్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మే 19వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. విద్యార్థులు ఈ-పాస్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

సమస్యలు పరిష్కరించాలి

జిన్నారం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : గడ్డపోతారం మున్సిపాలిటీలో సమస్యలు పరిష్కరించాలని స్థానిక నాయకులు నారబోయిన శ్రీనివాస్, కార్తీక్, కరుణాకర్‌గౌడ్, రాము, బాలు, అశోక్ కమిషన్‌ను కలిసి విన్నవించారు. తాగునీటి సమస్య పరిష్కారం, వీధిలైట్లు ఏర్పాటు, పనిచేయని సీసీ కెమెరాల పునరుద్ధరణ సహా ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరారు.

రాజ్యాంగ పరిరక్షణ కోసం జనచైతన్య యాత్ర

నారాయణఖేడ్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ పరిరక్షణ కోసం త్వరలో జహీరాబాద్ ఎంపీ సురేష్‌షెట్కార్, స్థానిక ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి ఆధ్వర్యంలో జైబాపు-జైభీం-జైసంవిధాన్ అభియాన్ పేరిట జనచైతన్య పాదయాత్ర నిర్వహిస్తున్నామని కాంగ్రెస్ సమన్వయకర్త ధనలక్ష్మి అన్నారు. సోమవారం ఖేడ్‌లోని ఎమ్మెల్యే సంజీవరెడ్డి స్వగృహంలో కాంగ్రెస్ ముఖ్య నాయకులతో సన్నాహక సమావేశం నిర్వహించి మాట్లాడారు. మహాత్మాగాంధీ శతాబ్ది జయంతిలో భాగంగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు.

ఉద్యోగుల సంబరాలు

జహీరాబాద్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం నూతన రెవెన్యూ చట్టం ఏర్పాటుచేసి గతంలో రెవెన్యూశాఖలో పనిచేసిన వీఆర్ఏ, వీఆర్వోలను తిరిగి ఆ శాఖలోకి తీసుకోవడాన్ని స్వాగతిస్తూ ఉద్యోగులు సోమవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట టపాసులు పేల్చి స్వీట్లు పంచుకుని సంబురాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం డివిజన్ అధ్యక్షుడు సంజీవ్‌రావు, కార్యదర్శి రజనీకాంత్, వీఆర్వోలు మోయిన్, అఫ్జల్, పెంటన్న, రాజు పాల్గొన్నారు.

కొనసాగిన సప్తాహ

నారాయణఖేడ్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి చాప్టా.కెలోని హనుమాన్ ఆలయంలో నిర్వహిస్తున్న అఖండ హరినామ సప్తాహ కార్యక్రమం నాలుగోరోజైన సోమవారం కూడా కొనసాగింది. మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు శ్రేయారెడ్డి, సంగప్ప, అనంతరెడ్డి, సిద్ధన్న, పీరన్న, అనిల్, తదితరులు పాల్గొని పూజలు చేశారు.

ఖేడ్ ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన విద్యాచరణ్‌రెడ్డి

నారాయణఖేడ్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): నారాయణఖేడ్ ఎస్ఐగా మళ్లీ విద్యాచరణ్‌రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆరునెలల క్రితం వరకు విద్యాచరణ్‌రెడ్డి నారాయణఖేడ్ ఎస్ఐగా విధులు నిర్వహించారు. అప్పట్లో ఆయనను సంగారెడ్డికి బదిలీ చేశారు. ఆయన స్థానంలో శ్రీశైలంను నియమించారు. తిరిగి విద్యాచరణ్‌రెడ్డిని నారాయణఖేడ్ ఎస్ఐగా నియమించి, శ్రీశైలంను సంగారెడ్డికి బదిలీ చేయడంతో సోమవారం ఆయన బాధ్యతలు చేపట్టారు.

మహనీయుల జయంతులను నిర్వహించాలి

నారాయణఖేడ్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : వచ్చేనెలలో మహనీయులైన అంబేడ్కర్, పూలే జయంతులను ఘనంగా నిర్వహించాలని కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అతిమెల మాణిక్ కోరారు. సోమవారం ఖేడ్ అంబేడ్కర్ భవన్‌లో కేవీపీఎస్, దళిత సామాజిక సంఘాల బాధ్యులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. నేటి ఆధునిక యుగంలోనూ అంటరానితనం, కుల వివక్షత ప్రత్యక్షంగానో, పరోక్షంగానో కొనసాగుతున్నాయన్నారు.

గ్రామాల్లో రేషన్‌కార్డుల దరఖాస్తుల పరిశీలన

కోహీర్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో దరఖాస్తు చేసుకున్న రేషన్‌కార్డుల పరిశీలన చేపట్టారు. సోమవారం మండల రెవెన్యూ సిబ్బంది ప్రత్యేక మొబైల్ యాప్ ద్వారా ఆయా గ్రామాల్లోని లబ్ధిదారుల ఇళ్ల వద్దకెళ్లి అర్హుల, అనర్హులను గుర్తించేందుకు మొబైల్ యాప్ వినియోగిస్తున్నారు.

ప్రజావాణి సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉండాలి

● సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి


ప్రజావాణిలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి


వినతులను పరిశీలిస్తున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

సంగారెడ్డి రూరల్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : ప్రజావాణి వచ్చే సమస్యల పరిష్కారానికి అధికారులు కట్టుబడి ఉండాలని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదేశించారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి వివిధ జిల్లాల నుంచి వచ్చిన ప్రజల నుంచి కలెక్టర్ అర్జీలు స్వీకరించారు. ప్రజావాణిలో రెవెన్యూశాఖకు సంబంధించి 25 అర్జీలు, పౌర సరఫరాల శాఖకు రెండు, సర్వే ల్యాండ్‌కు మూడు, పంచాయతీరాజ్ విభాగానికి ఏడు, డీఆర్డీవో 3, పశు వైద్యశాఖ రెండు, ఆరోగ్యశాఖకు మూడు మొత్తం 69 అర్జీలు అందాయి. అర్జీలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మాధురి, డీఆర్వో పద్మజారాణి, జడ్పీ సీఈవో జానకీరెడ్డి, ఆర్డీవో రవీందర్‌రెడ్డి, ఏవో పరమేశం, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు. అలాగే వాసవీ మా ఇల్లు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మంచినీటి సరఫరా ట్యాంకర్‌ను కలెక్టర్ క్యాంపు కార్యాలయం వద్ద వల్లూరు క్రాంతి జెండా ఊపి ప్రారంభించారు.

'ప్రజావాణి'కి 85 దరఖాస్తులు: కలెక్టర్

మెదక్ అర్బన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : ప్రజావాణిలో స్వీకరించిన విజ్ఞప్తులను వెంటనే పరిష్కరించాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించిన ఆయన వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజావాణికి మొత్తం 85 అర్జీలు రాగా.. ఇందులో ధరణి 30, ఇందిరమ్మ ఇండ్లు 3, పెన్షన్ 3, ఉద్యోగ ఉపాధి 2, ఇతర సమస్యలకు సంబంధించి 47 దరఖాస్తులు ఉన్నాయి. ఈ కార్యక్రమంలో డీఆర్వో భుజంగరావు, జెడ్పీ సీఈవో ఎల్లయ్య పాల్గొన్నారు.

ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి: ఎస్పీ

పోలీసు ప్రజావాణి వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి సూచించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు.

'ప్రజావాణి'పై ఆసక్తి చూపని జనం

అల్లాదుర్గం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : ప్రజల సమస్యలతో పాటు గ్రామాల్లో నెలకొన్న పలు సమస్యల పరిష్కారం అల్లాదుర్గంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించిన ప్రజావాణికి ఆదరణ కరువైంది. తహసీల్దార్ మల్లయ్యతో పాటు రెవెన్యూ సిబ్బంది మధ్యాహ్నం వరకు వేచిచూసినా ఒక్క దరఖాస్తు రాలేదని తెలిపారు.

కోహీర్‌లో ప్రజావాణి వినేవారేరి....?

కోహీర్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : కోహీర్ మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి ఉదయం 11 గంటలైనా ఒక్క అధికారి హాజరుకాలేదు. అధికారులు లేకపోవడంతో మనీయర్‌పల్లి, నాగిరెడ్డిపల్లి తదితర గ్రామాల ప్రజలు నిరాశగా వెనుదిరిగారు. ప్రజావాణిని పకడ్బందీగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

పటాన్‌చెరులో నియోజకవర్గ స్థాయి ఇఫ్తార్ విందు

● ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఏర్పాట్లు


ఇఫ్తార్ విందులో ముస్లింలతో కలిసి పాల్గొన్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : పటాన్‌చెరులో సోమవారం సాయంత్రం ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి భారీ ఇఫ్తార్ విందును పట్టణంలోని జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో ఏర్పాటు చేశారు. నియోజకవర్గం నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో ముస్లింలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రముఖ ముస్లిం ఆధ్యాత్మిక ప్రవచన కర్త బ్రదర్ షఫీ పరమత సహనం, హైదరాబాద్ దక్కన్ గంగాజమునా తహజీబ్ విశిష్టతను వివరించారు. అన్ని మతాల సారం ఒక్కటే నని, ప్రతి ఒక్కరు ఆపదలో ఒకరినొకరు ఆదుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ గత 25 ఏళ్లుగా తాను ప్రతి సంవత్సరం ఇఫ్తార్ విందులను ఏర్పాటు చేయడం ఆనవాయితీగా వస్తోందన్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు అనిల్‌కుమార్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆలయాల నిర్మాణాలకు సహకారమందిస్తా

● ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు రూరల్/అమీన్‌పూర్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : ఆలయాల నిర్మాణాలకు సహకారమందిస్తానని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలోని చిట్కుల్ వేణుగోపాలస్వామి ఆలయ వార్షికోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ప్రతి ఒక్కరూ దైవభక్తిని పెంపొందించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శ్రీశైలంయాదవ్, సీనియర్ నాయకులు వెంకట్‌రెడ్డి, దశరథ్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, చిన్నరాములు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఆలయాల అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే సొంత నిధులతో నిర్మించిన అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని వందనపురి కాలనీ సీతారామాంజనేయ ఆలయ స్వాగత తోరణాన్ని సోమవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నందారంనర్సింహగౌడ్, నాయకులు రమేష్‌గౌడ్, ప్రమోద్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆశావర్కర్లతో పెట్టుకుంటే కాలగర్భంలోకే..


వెల్దుర్తిలో పోలీస్ స్టేషన్‌లో ఉన్న ఆశావర్కర్లు

సంగారెడ్డి రూరల్/నర్సాపూర్/శివ్వంపేట/వెల్దుర్తి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : ఆశావర్కర్లతో పెట్టుకుంటే కాలగర్భంలో కలిసిపోతారని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు సోమవారం ఓ ప్రకటనలో హెచ్చరించారు. ఇచ్చిన హామీలు అమలు చేయాలని హైదరాబాద్ కమిషనర్ కార్యాలయం వద్దకు శాంతియుతంగా వెళ్తున్న ఆశాలను అరెస్ట్ చేయడం అప్రజాస్వామికమన్నారు. చలో హైదరాబాద్‌కు తరలివెళ్లకుండా నర్సాపూర్‌లో ఆశావర్కర్లను పోలీసులు అరెస్ట్ చేసి మధ్యాహ్నం తర్వాత సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. అక్రమ అరెస్టులు సరైన పద్ధతి కాదని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏ.మహేందర్‌రెడ్డి మండిపడ్డారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నిజామాబాద్, కామారెడ్డి, జిల్లాలకు చెందిన ఆశావర్కర్లు హైదరాబాద్‌లో నిర్వహించే ధర్నా వెళ్లకుండా సోమవారం పోలీసులు ముందస్తు అరెస్ట్ చేసి వెల్దుర్తి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

క్రికెట్ పోటీల్లో 'హానర్ వివాంటిస్' జట్టు గెలుపు

రామచంద్రాపురం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): కొన్నిరోజులుగా తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ (తెనా) ఆధ్వర్యంలో జరుగుతున్న మహిళా క్రికెట్ పోటీలు సోమవారంతో ముగిశాయి. సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్ మున్సిపాలిటీలోని అపార్టుమెంట్లు, విల్లాలకు చెందిన మహిళా క్రీడాకారులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారు. ఈ క్రికెట్ పోటీల్లో 'హానర్ వివాంటిస్' జట్టు ఘన విజయం సాధించింది. మై ఫేర్ విల్లాలకు సంబంధించి మై ఫేయర్ ముస్టాంగ్స్ జట్టు రన్నర్స్‌గా నిలిచారు. విజేతలకు తెనా అధ్యక్షులు ఈశ్వరిగారి రమణ, రేసింగ్ ఎహెడ్ డైరెక్టర్ శ్రీనివాస్ జ్ఞాపికలను అందజేశారు.

మై హోం త్రిదశ నూతన కమిటీ

తెల్లాపూర్ మున్సిపాలిటీలోని మై హోం త్రిదశ నూతన కార్యవర్గ కమిటీని అపార్ట్‌మెంట్ సభ్యులు ఎన్నికల ద్వార ఎన్నుకున్నారు. జిల్లా సొసైటీల ఎన్నికల అధికారి ఎ.వెంకట్‌రెడ్డి నూతన కమిటీ సభ్యులతో ప్రమాణం చేయించారు. అధ్యక్షులుగా సీతారామశర్మ, వైస్ ప్రెసిడెంట్ వీరారెడ్డి, ప్రధాన కార్యదర్శి సంతోష్‌లింగస్ నాగరి, జాయింట్ సెక్రటరీ శ్రీధరశాస్త్రి, ట్రెజరర్ సురేష్ పాల్గొన్నారు.

48వ రోజుకు రిలే దీక్షలు

గుమ్మడిదల, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : గుమ్మడిదల మండలం నల్లవల్లి గ్రామపంచాయతీ పరిధిలోని ప్యారానగర్‌లో జీహెచ్ఎంసీ ఏర్పాటు చేస్తున్న డంపింగ్‌యార్డుకు వ్యతిరేకంగా గుమ్మడిదల, నల్లవల్లి, మంబాపూర్, కొత్తపల్లి గ్రామస్థులు ఉద్యమం కొనసాగిస్తున్నారు. సోమవారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద ఆయా గ్రామాల ప్రజలు ధర్నా చేపట్టారు. డంపింగ్‌యార్డు నిర్మాణం ఆపేవరకూ ఉద్యమం కొనసాగుతుందని హెచ్చరించారు.

మూడోరోజు ప్రశాంతంగా పదో తరగతి పరీక్షలు

సంగారెడ్డి అర్బన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లాలో పదో తరగతి పరీక్షలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా సోమవారం తృతీయ భాష పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఉదయం 9.30 గంటల నుంచి 12.30 గంటల వరకు పరీక్ష నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా 122 పరీక్షా కేంద్రాల్లో 22,406 మంది విద్యార్థులకుగాను 22,362 మంది హాజరు కాగా 44 మంది గైర్హాజరయ్యారు. 99.8 హాజరుశాతం నమోదైంది. కాగా జిల్లాలోని కంది జడ్పీహెచ్ఎస్, కాశీపూర్‌లోని టీజీఎంఆర్ఎస్, ఇస్నాపూర్ జడ్పీహెచ్ఎస్, పటాన్‌చెరులోని శిశు విహార్ హైస్కూల్ కేంద్రాలను జిల్లా అబ్జర్వర్ ఉషారాణి, చౌటకూర్, పుల్కల్ పరీక్షా కేంద్రాలను డీఈవో వెంకటేశ్వర్లు, ఫ్లైయింగ్ స్క్వార్డ్స్ 38 కేంద్రాలను పరిశీలించారు.

బ్రాహ్మణ సంఘం బాధ్యులకు సన్మానం


బ్రాహ్మణ సంఘ రాష్ట్ర కార్యవర్గాన్ని అభినందిస్తున్న జిల్లా బాధ్యులు

జోగిపేట, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ బ్రాహ్మణ సంఘాల సమాఖ్య (టీబీఎస్ఎస్ఎస్) నూతన కార్యవర్గాన్ని సోమవారం జిల్లాకు చెందిన సంఘ బాధ్యులు భువనగిరిలోని స్వర్ణగిరి ఆలయంలో కలిసి అభినందించారు. సంఘ నూతన చైర్మన్ వీ.జగన్మోహన్‌శర్మ, అధ్యక్షుడు మోతుకూరి రామ్మోహన్‌రావు, ప్రధాన కార్యదర్శి వైద్య ప్రభాకర్‌శర్మ, కోశాధికారి సముద్రాల విజయ సారధిలను జిల్లాకు చెందిన రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయభాస్కర్‌ను ఎన్నుకున్నారు.

బజరంగ్‌దళ్ సంగారెడ్డి పట్టణ కన్వీనర్‌గా తరుణ్



సంగారెడ్డి అర్బన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : బజరంగ్‌దళ్ సంగారెడ్డి పట్టణ కన్వీనర్‌గా ఉప్పరి తరుణ్ నియమితులయ్యారు. అదేవిధంగా కో కన్వీనర్లుగా సృజన్, అఖిల్, ముఖేష్, సభ్యులుగా ప్రణయ్, శివ తదితరులు నియమితులయ్యారు. ఈ సందర్భంగా పట్టణ కన్వీనర్ తరుణ్ మాట్లాడుతూ హిందూ ధర్మ రక్షణే ధ్యేయంగా పనిచేస్తానని తెలిపారు.

పశువుల దుకాణంలో చోరీ

తూప్రాన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : పశువుల మందుల దుకాణం కౌంటర్‌లో ఉంచిన నగదును గుర్తు తెలియని దొంగలు సోమవారం చోరీ చేశారు. తూప్రాన్ ఎస్ఐ శివానందం కథనం ప్రకారం.. తూప్రాన్ పట్టణానికి చెందిన మన్నె శ్రీకాంత్ ఆర్టీసీ బస్టాండ్ వద్ద పరమేశ్వర వెటర్నరీ మందుల దుకాణం ఏర్పాటు చేశాడు. సోమవారం ఉదయం శ్రీకాంత్ ఇంటి నుంచి రూ.95వేల నగదు తీసుకువచ్చి కౌంటర్ గల్లలో పెట్టాడు. మధ్యాహ్నం దుకాణం షెట్టర్‌ను సగానికి కిందకు వేసి పని మీద శివ్వంపేటకు వెళ్లాడు. మధ్యాహ్నం 2 గంటలకు దుకాణానికి వచ్చి చూడగా కౌంటర్ గల్లలో ఉంచిన రూ.95 వేలు కనిపించలేదు. ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనం చేసినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివానందం వివరించారు.

విద్యుత్ స్తంభాలను సరిచేసిన అధికారులు


కోహీర్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన కోహీర్ నుంచి రాజనెల్లి గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి పక్కన విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా వంగి ఉండడంపై ఈనెల 22న 'పడితే ప్రమాదమే' అన్న శీర్షికన వార్త ప్రచురితమైంది. దీంతో అధికారులు స్పందించి వంగిన స్తంభాలను సరిచేస్తున్నారు.

కాంగ్రెస్‌వి గ్యారంటీ లేని పథకాలు : క్రాంతికిరణ్


బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకులకు కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న చంటి క్రాంతికిరణ్

మునిపల్లి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్‌వి గ్యారంటీ లేని పథకాలని అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ అన్నారు. సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం ఖమ్మంపల్లి కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు టేకూరి నాగరాజ్‌తో పాటు బుదేరా, కల్లపల్లి బేలూర్ గ్రామాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు సోమవారం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పైతర సాయికుమార్ ఆధ్వర్యంలో చంటి క్రాంతికిరణ్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీని పూర్తిస్థాయిలో అమలు చేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సాయికుమార్, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి శశికుమార్ పాల్గొన్నారు.

అంబులెన్స్ ఏర్పాటుతో ప్రజలకు ఉపయోగం


అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న మల్లేశ్‌గౌడ్

నర్సాపూర్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : మెదక్ ఎంపీ రఘునందన్‌రావు తన నిధుల నుంచి నియోజకవర్గ కేంద్రాలకు మంజూరు చేసిన అంబులెన్స్‌లు ప్రజలకు ఎంతగానో ఉపయోగపడతాయని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేశ్‌గౌడ్ పేర్కొన్నారు. సోమవారం అంబులెన్స్‌ను నర్సాపూర్ ఆస్పత్రికి అప్పగించి మాట్లాడారు. ఆపదలో ఉన్నవారిని, క్షతగాత్రులను ఆస్పత్రికి తీసుకొచ్చేందుకు అంబులెన్స్‌లు దోహదపడతాయన్నారు.

'ధర్మాన్ని స్మరించాలి'

సదాశివపేట, మార్చి 24: (ఆంధ్రజ్యోతి) : ప్రతిఒక్కరూ ధర్మాన్ని స్మరించాలని శ్రీమాన్ ప్రణవానంద దాస్ ప్రభుజీ ప్రవచించారు. ఆదివారం సంగారెడ్డి జిల్లా సదాశివపేట పట్టణంలో భక్తివేదాంత యూత్ సర్వీసెస్ ఆధ్వర్యంలో స్థానిక బసవసేవాసదన్ కల్యాణ మండపంలో నిర్వహించిన గీతా ప్రవచనంకు ఆయన హాజరై భక్తులకు భగవద్గీత మహత్యాన్ని, ధార్మిక జీవన విధానాన్ని విశదీకరించారు.

ప్రజలకు అందుబాటులో న్యాయ సేవలు

● బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి


మరమ్మతు పనులు ప్రారంభిస్తున్న బార్ కౌన్సిల్ సభ్యులు

జిన్నారం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు అందుబాటులో న్యాయ సేవలందించాలనే సుప్రీంకోర్టు లక్ష్యం మేరకు ప్రభుత్వం నూతన న్యాయ స్థానాలను ఏర్పాటు చేస్తుందని బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. సోమవారం జిన్నారంలో జూనియర్ సివిల్ జడ్జి కమ్ జ్యూడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు కోసం ఎంపిక చేసిన తాత్కాలిక భవనంలో రూ.8.40 లక్షలతో చేపట్టిన మరమ్మతు పనులను బార్ కౌన్సిల్ సభ్యులు ప్రారంభించారు. కాగా జిన్నారం కోర్టు పరిధిలోకి జిన్నారం, హత్నూర, గుమ్మడిదల మండలాలు, 4 పోలీస్‌స్టేషన్ల పరిధిలో కేసుల విచారణ జరుగుతుందని నర్సాపూర్ కోర్టు బార్ కౌన్సిల్ అధ్యక్షులు శ్రీధర్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రవీందర్‌గౌడ్, బార్ కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ

జహీరాబాద్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని కోర్టు సమీపంలో బార్ అసిసోయేషన్ సభ్యులు, న్యాయవాది సయ్యద్ అజీజ్‌పై దాడిచేయడాన్ని నిరసిస్తూ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు సోమవారం విధులు బహిష్కరించారు. దాడికి పాల్పడిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. అలాగే ఇబ్రహీంపట్నం న్యాయవాది హత్యను వారు తీవ్రంగా ఖండించారు. న్యాయవాదులపై తరచూ దాడులు జరుగుతున్న తీరుపై వారు విచారం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గోపాల్, న్యాయవాదులు పాండురంగారెడ్డి, అశోక్‌పాటీల్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సర్కారు బడులకు కొత్త వంట పాత్రలొచ్చాయ్

సంగారెడ్డి అర్బన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : సర్కారు బడులకు కొత్త వంట పాత్రలను పాఠశాల విద్యాశాఖ సరఫరా చేసింది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థులకు మధ్నాహ్న భోజనాన్ని వండి పెట్టేందుకు వీలుగా నిర్వాహకులకు పంపిణీ చేసింది. ఇంతవరకు నిర్వాహకులే కొన్నేళ్లు సొంత వంట సామగ్రితో వండి పెట్టేవారు. కొన్నిచోట్ల సరిపడా పాత్రలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్న పరిస్థితి. తాజాగా జిల్లా వ్యాప్తంగా 500 ప్రభుత్వ పాఠశాలలకు కొత్తగా సరఫరా చేసిన వంట పాత్రలతో నిర్వాహకులకు ఆర్థికంగా ఉపశమనం కలిగింది.

దళితుల ప్రాణాలకు రక్షణ కల్పించండి

● రాష్ట్ర ట్రేడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మఠం బిక్షపతి


బీఆర్ఎస్ నేత పల్లె సంజీవయ్యను పరామర్శిస్తున్న రాష్ట్ర ట్రేడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మఠం బిక్షపతి

పుల్‌కల్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): దళితుల ప్రాణాలకు రక్షణ కల్పించి, సినీనిర్మాత, రియల్ ఎస్టేట్ వ్యాపారి మేడికొండ వెంకటమురళీకృష్ణను అరెస్ట్ చేయాలని రాష్ట్ర ట్రేడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మఠం బిక్షపతి, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు కాశపాగ ఇమ్మయ్య, అంబేడ్కర్ సేవాసమితి రాష్ట్ర అధ్యక్షుడు కొండాపురం జగన్, గిరిజన సంక్షేమ సంఘం ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షుడు జైపాల్ నాయక్ డిమాండ్ చేశారు. వెంకటమురళీకృష్ణ అనుచరుల దాడిలో గాయపడిన జోగిపేట ఏఎంసీ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ సీనియర్ నేత పల్లె సంజీవయ్య, ఆయన కుమారుడు పల్లె క్రాంతిలను సోమవారం వేర్వేరుగా పరామర్శించారు. స్థానిక రైతుల భూములను కబ్జా చేస్తూ దౌర్జన్యాలకు పాల్పడటాన్ని వారు తీవ్రంగా ఖండించారు. ఆయన వెంట నాయకులు వీరశెట్టి అశోక్, నగేష్‌గౌడ్, అర్షద్, బ్రహ్మానందారెడ్డి, దేవదాస్ ఉన్నారు.

బాలికలను రక్షిద్దాం.. చదివిద్దాం

కల్హేర్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : ఆడపిల్లలను రక్షించి.. మగ పిల్లలతో సమానంగా చదివించాలని నారాయణఖేడ్ ఐసీడీఎస్ సీడీపీవో సుజాత అన్నారు. కల్హేర్‌లోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో సోమవారం బేటి బచావో, బేటి పడావో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లింగ వివక్ష లేకుండా చూడాలన్నారు. అనంతరం బాలికల పేరున హెల్త్ సెంటర్ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ జేబా షమీన్, సీహెచ్‌వో శివకుమార్, హెల్త్ సూపర్‌వైజర్ మాణిక్యం, సిబ్బంది పాల్గొన్నారు.

ఐఎన్‌హెచ్‌పీసీ రాష్ట్ర కార్యదర్శిగా దత్తారెడ్డి

నారాయణఖేడ్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ నేషనల్ హ్యూమన్‌రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ (ఐఎన్‌హెచ్‌పీసీ) రాష్ట్ర కార్యదర్శిగా ఖేడ్ మండలం సంజీవన్‌రావుపేటకు చెందిన దత్తారెడ్డి ఎన్నికయ్యారు. సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నవోదయసిద్దు, రాష్ట్ర సమన్వయకర్త బాబు, దత్తారెడ్డిని శాలువాలతో సన్మానించి పుష్పగుచ్ఛాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

చంద్రమౌళీశ్వరుడికి పుష్పార్చన

నారాయణఖేడ్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : ఖేడ్ పట్టణ శివారులోని వెంకటాపూర్ చౌక్ సమీపంలో నిర్మించిన భక్తమార్కండేయస్వామి ఆలయంలో సోమవారం పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రమౌళీశ్వరుడికి అభిషేకం, మహాహారతి, ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు పురోహితుడు కృష్ణస్వామి ఆధ్వర్యంలో చంద్రమౌళీశ్వరుడికి పుష్పార్చన చేశారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన

మునిపల్లి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : లయన్స్ క్లబ్ సాధురాం కంటి ఆస్పత్రి సహకారంతో మండలంలోని తాటిపల్లి గ్రామ శివారులో గల యునైటెడ్ స్కూల్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి అపూర్వ స్పందన లభించింది. ఈ శిబిరంలో 150 మందికి వైద్యులు కంటి వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైనవారికి రాయికోడ్ మండలం సంగాపూర్ మాజీ సర్పంచ్ యాదవరెడ్డి సహకారంతో కంటి అద్దాలు అందజేశారు.

గాయమైనా పరీక్ష రాశాడు..


పరీక్ష రాసి బయటకు వస్తున్న అరవింద్

చేగుంట, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : చేగుంట మండలం బోనాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న ఆత్కూరి అరవింద్ ఈనెల 20న వ్యవసాయ పొలం వద్దకు వెళ్లి తిరిగి వస్తుండగా బైక్ పైనుంచి పడ్డాడు. ఈ ప్రమాదంలో కుడికాలు విరిగింది. వెంటనే సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. కుడికాలు రెండు ఎముకలు విరిగిపోవడంతో డాక్టర్లు అతడికి సర్జరీ చేశారు. ఈనెల 21న పదో తరగతి పరీక్షలు ప్రారంభం కావడంతో తీసుకెళ్లాలని అరవింద్ కోరాడు. దీంతో కుటుంబసభ్యులు సోమవారం కారులో వడియారం పరీక్షా కేంద్రానికి తీసుకెళ్లడంతో ఇంగ్లిష్ పరీక్ష రాశాడు.